# ఒక్క దరఖాస్తు అనేక సందేహాలు

"రేషన్ కార్డు ఉందా.. ఆధార్ కార్డులో అడ్రస్ ఇక్కడే ఉందా.. రేషన్ కార్డు లేకుంటే స్కీమ్స్ రావు.. రేషన్ కార్డు కోసం తెల్లకాగితంలో రాసివ్వండి.. ఒక కుటుంబంలో ఒకటే స్కీమ్ వస్తుంది.." అంటూ ప్రజాపాలన కార్యక్రమంలో దరఖాస్తులు చేసుకునేందుకు వచ్చిన వారికి అధికారులు చుక్కలు చూపించారు. దరఖాస్తులు ఎలా నింపాలో.. రేషన్ కార్డుల కోసం ఎవర్ని అడగాలో తెలియక జనం ఆయోమయానికి గురయ్యారు."

## గందరగోళం నడుమ తొలి రోజు ప్రజాపాలన

- అప్లికేషన్లు అందించలేక చేతులెత్తేసిన జీహెచ్ఎంసీ
- దరఖాస్తు స్వీకరణలోనూ అంతా గజిబిజి
- పథకాలపై స్పష్టతలేక.. ప్రజలకు సమాధానాలు చెప్పలేక అధికారుల అవస్థలు
- కౌంటర్ల కంటే మీ సేవా, జిరాక్స్ సెంటర్లకే పోటెత్తిన జనం
- ఇదే అదునుగా దోపిడీకి తెరలేపిన జిరాక్స్ సెంటర్లు, మీ సేవా నిర్వాహకులు
- ఒక్కో దరఖాస్తు జిరాక్స్‌కు రూ.50 నుంచి రూ.100 వసూళ్లు
- భారీగా దరఖాస్తు దారుల జేబులకు చిల్లులు
- ముందస్తు అవగాహన కల్పించాలని ప్రభుత్వానికి ప్రజల వేడుకోలు
- ఆన్‌లైన్‌లో అవకాశం కల్పించాలని డిమాండ్




మొఘల్‌పురాలోని స్పోర్ట్స్ కాంప్లెక్స్ వద్ద బారులు తీరిన దరఖాస్తు దారులు

సిటీబ్యూరో, డిసెంబర్ 28 (నమస్తే తెలంగాణ ) : ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకున్న అభయహస్తం పథకం అమలులో భాగంగా గురువారం ప్రారంభించిన ప్రజాపాలన గందరగోళం నడుమ తొలి రోజు ముగిసింది. గ్రేటర్ వ్యాప్తంగా 150 వార్డుల్లో 600 సెంటర్లను ఏర్పాటు చేసి రెండు సెషన్ల ద్వారా రోజంతా ప్రజా పాలనలో దరఖాస్తుల స్వీకరణకు అధికారులు శ్రీకారం చుట్టారు. అయితే ఈ దరఖాస్తు సగటు దరఖాస్తుదారుడికి చిక్కుముడిగా మారి.. అప్లికేషన్ ఎక్కడ చేసుకోవాలనేది మొదలు.. అందులో ఉన్న ప్రతి అంశం దరఖాస్తుదారులకు సవాల్‌గా మారింది. ఆరు గ్యారంటీలలో ఏ పథకానికి అర్హులు, సరైన విధి విధానాలు పొందు పర్చకుండా ఆధార్‌కార్డు, రేషన్‌కార్డు మెలిక ఒకవైపు.. దరఖాస్తు ఫారాలు ఇవ్వకుండా దరఖాస్తు చేసుకోవాలా? అన్న ప్రశ్నల నడుమ తొలిరోజు ప్రజలను గజిబిజి గందరగోళానికి గురి చేసింది. ఒక్క మాటలో చెప్పాలంటే రోజంతా ప్రజల్లో ప్రజాపాలనపై ఆందో ళన మాత్రం స్పష్టంగా కనబడింది.

### దరఖాస్తు ఫారాల పంపిణీలో జీహెచ్ఎంసీ నిర్లక్ష్యం



చిలుకానగర్ వార్డు ఆఫీసు వద్ద

ప్రభుత్వం సూచించిన విధంగా ఇంటిం టికి దరఖాస్తులు రాక ప్రజలు ఇబ్బం దులు పడగా కేంద్రాల వద్ద అధికా రులను అడిగినా సరైన సమా చారం ఇవ్వకపోవడంతో ఇబ్బందులు పడ్డారు. దర ఖాస్తు ఫారాల పంపిణీలో జీహెచ్ఎంసీ నిర్లక్ష్యం కొట్టొచ్చినట్లు కనబడింది. ప్రతి ఒక్కరికీ ముందు గానే దరఖాస్తులు అందజే శామని పైకి చెప్పినా.. వేలల్లో కౌంటర్ కేంద్రాల వద్దకు వచ్చిన దరఖాస్తుదార లకు ఫారాలను అందజేయలేక చేతులెత్తేశారు. దీంతో చివరకు జిరాక్స్ సెంటర్ల వద్ద దరఖాస్తుల కోసం తాకిడీ పెర గడంతో ఇదే అదునుగా వారు ఒక్కో దరఖాస్తుకు రూ.50 నుంచి రూ.100 వరకు దరఖాస్తుదారులు సమర్పించు కోవాల్సి వచ్చింది. కాగా దరఖాస్తుదారులు సమర్పించిన దరఖా స్తును స్వీకరించిన అధికారులు వెంటనే రిసిప్ట్‌ను అందజేశారు. అప్లికేషన్ అయిపోయాక అడ్రస్, ఏ స్కీమ్‌లకు ఆప్లై చేసుకున్నారో వాటిపై టిక్ చేసి రసీదు ఇచ్చారు. అయితే ఈ రసీదును జాగ్రత్తగా పెట్టుకోవాలని అధికారులు సూచించారు.

### పథకాలపై స్పష్టతనివ్వని అధికారులు

మహాలక్ష్మి పథకంలో భాగంగా పథకానికి అర్హులైన మహిళలు ఇంట్లో ఒకరి కన్నా ఎక్కువ ఉంటే ఆ పథకంకి అందరికీ వర్తిం చదా? అన్న సందేహాలు వ్యక్తం చేశారు. గృహలక్ష్మి పథకానికి సంబంధించి ఒకే ఇంట్లో విద్యుత్ మీటర్లు ఉంటే, సిలిండర్లు వేర్వేరు వ్యక్తుల పేర్ల మీద ఉంటే అలాంటి వారికి గృహజ్యోతి పథకం వర్తిస్తుందా? లేక ఇంట్లో ఎవరి పేరు మీద ఉన్నా పథకానికి అర్హులేనా ఉన్న అంశంపై అధికారులు స్పష్టత ఇవ్వడం లేదు. చిన్న పిల్లలకు ఆధార్ కార్డులు లేకపోయినా వారి పేర్లు దరఖాస్తుదారులు రాస్తే పరిగణలోకి తీసుకుం టారా, దీనికి మరో మార్గం ఉంటుందా? అనే విషయా లపై ఆరా తీశారు.

### ఎన్నో అనుమానాలు

ప్రభుత్వం ప్రవేశపెట్టిన అభయహస్తం కింద ఆరు గ్యారంటీ దరఖాస్తుల స్వీకరణలో ఎన్నో అనుమ నాలు, ప్రశ్నలు తలెత్తుతున్నాయి. ప్రభుత్వం మాత్రం దరఖా స్తుదారుల నుంచి వివరాల (డేటా) సేకరణ మాత్రమే అని చెబు తున్నా.. ఏ పథకానికి ఏ అర్హత ఉంటుందో? ఎలా ఎంపిక చేస్తారో ? అన్నది గైడ్‌లైన్స్ ఇవ్వకుండా దరఖాస్తులను తీసుకుంటున్న తీరు విస్మ యానికి గురి చేస్తున్నది. ముఖ్యంగా ప్రజల సందేహాలకు అధికారులు సరైన సమాధానాలు చెప్పలేకపోవడంతో ప్రభుత్వ పథకాలు తమకు అందుతాయో లేదోనన్న ఆందోళన నెలకొంది. ఒకే కుటుంబంలో ఇప్పటికే రేషన్‌కార్డు ఉంటే ఆ కుటుంబంలో వేరు పడిన వ్యక్తి కొత్త కార్డుకు ఎలా దరఖాస్తు చేసుకోవాలి.? ఒకవేళ దర ఖాస్తు చేసుకుంటే పథకం అర్హతకు ఎంత సమయం పడుతుంది అని అధికారులపై ప్రశ్నల వర్షం కురిపించారు.

### రేషన్ కార్డుల కోసం భారీగా జనం..

అన్ని పథకాలకు రేషన్‌కార్డు ప్రామా ణికమని ప్రభుత్వంలోని మంత్రులు చెప్ప డంతో ఎక్కువమంది రేషన్ కార్డుల కోసమే కేంద్రాల వద్దకు వచ్చినట్లు కనిపించింది. రేషన్ కార్డులో తమ పేర్లు కొత్తగా ఎక్కించాలని తెలిపారు. ఆధార్ కార్డులో ఉన్న చిరు నామాలో వేరుగా ఉండడంతో తమకు రేషన్ కార్డులు వస్తాయో లేదో అని పలువురు సిబ్బందిని ఆరా తీయడం కనిపించింది.

### స్పష్టత లేక దరఖాస్తు దారుల్లో అయోమయం

ప్రజా పాలన కేంద్రాల్లో ప్రజలు అయోమయ పరిస్థితుల్లో కని పించారు. అభయ హస్తం కింద ఆరు గ్యారంటీలకు సంబంధించి ఎలా దరఖాస్తు చేసుకోవాలో అవగాహన కల్పించకపోవడంతో పలు కేంద్రాల్లో దరఖాస్తు దారులు ఫారాలు నింపేందుకు తికమ కపడ్డారు. దీంతో పాటు దరఖాస్తు ఫారాలతో పాటు ఆధార్, ప్యాన్, గ్యాస్, కరెంట్ బిల్లు, తెల్లరేషన్ కార్డుల జిరాక్సులు జతచే యాల్సి ఉంది. కానీ చాలా మంది గ్రామీణ ప్రాంతాల నుంచి వల స వచ్చి హైదరాబాద్‌లో నివసిస్తున్నారు. దీంతో ఆధార్ కార్డులో ఒక అడ్రస్, కరెంటు బిల్లులో మరో అడ్రస్, రేషన్ కార్డులో ఇంకో అడ్రస్ ఉండడంతో పాటు గ్యాస్ బిల్లులు జతచేయాల్సి ఉండగా స్వస్థలం ఊర్లో చేసుకోవాలా, లేక ప్రస్తుతం ఉంటున్న నగరంలో చేసుకోవాలా అనే అయోమయం, గందరగోళం కేంద్రాల్లో దర ఖాస్తుల కోసం వచ్చిన ప్రజల్లో స్పష్టంగా కనిపించింది.

### ప్రజాపాలనపై ప్రజలకు దక్కని భరోసా

- దరఖాస్తు ఫారంతో జత చేయాల్సిన సర్టిఫికెట్లలో ఆధార్ కార్డు, ఫుడ్ సెక్యూరిటీ కార్డు (రేషన్‌కార్డు) తప్పనిసరి కావ డంతో.. రేషన్‌కార్డు లేని పేదలంతా దరఖాస్తు ఎలా చేయాలని బాధపడ్డారు. కొందరైతే ఫుడ్ సెక్యూరిటీ కార్డు కోసం దరఖాస్తు ఫారంలు అందుబాటులో లేకపోవ డంతో తెల్లకాగితంపైన దరఖాస్తు చేశారు.
- అభయహస్తం దరఖాస్తు ఫారంలు కేవలం తెలుగులోనే ఉండగా.. ఇంగ్లీష్, ఉర్దూ, హిందీ మాధ్యమాలలో దరఖా స్తులు ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు.
- దరఖాస్తు చేయడానికి ఆన్‌లైన్‌లో అవకాశం కల్పించాలని ప్రజలు డిమాండ్ వ్యక్తం చేస్తున్నారు. సాంకేతిక పరిజ్ఞానం కొత్త పుంతలు తొక్కుతున్న వేళ రోడ్లపైకి వచ్చి క్యూ లైన్‌లో నిల్చొని సమయం వృథా చేసుకునే విధానం అవసరం లేదన్న డిమాండ్‌లు వినిపించాయి.
- హైదరాబాద్‌లో అభయహస్తంలోని పథకాలకు దరఖాస్తు చేసుకుంటే.. ఊర్లో ఉన్న పొలాలకు రైతు భరోసాకు మరో సారి దరఖాస్తు చేసుకోవాలా అనే ప్రశ్నకు సిబ్బంది, అధి కారులు సమాధానాలు చెప్పలేకపోయారు.
- ఆరు గ్యారంటీల్లో భాగంగా విద్యార్థులకు రూ.5 లక్షల వడ్డీ లేని రుణాల ప్రస్తావన దరఖాస్తుల్లో లేదని.. దానిగురించి మరోసారి దరఖాస్తు చేసుకోవాలా అన్న ప్రశ్నకు అధికా రులు పెదవి విరిచారు.
- ఇప్పటికే ఆసరా పింఛన్ పొందుతున్న వారెవ్వరూ మళ్లీ దరఖాస్తు పెట్టాల్సిన అవసరం లేదని అధికారులు క్లారిటీ ఇచ్చినప్పటికీ కొన్ని చోట్ల వృద్ధులు, మహిళలు భారీగా కౌంటర్ కేంద్రాలను తరలివచ్చి అవస్థలు ఎదుర్కొన్నారు.
- ఆధార్‌కార్డు తప్పనిసరి కావడంతో మార్పులు, చేర్పుల కోసం దరఖాస్తుదారులు కౌంటర్ కేంద్రాల కంటే మీ సేవా సెంటర్లకే పోటెత్తారు. సమయంతో కూడుకున్న ఆధార్ మార్పులు, చేర్పులు కారణంగా సకాలంలో దర ఖాస్తు చేసుకోలేని వీరికి భరోసా కల్పించాల్సిన అవసరం ప్రభుత్వంపై ఉంది.

---

## స్పష్టతలేని హామీలకోసం.. పరుగోపరుగు

- ఉచిత బస్ ప్రయాణాల్లో ఆధార్ అప్‌డేట్
- గ్యాస్ సబ్సిడీకి కేవైసీ లింక్
- మీ సేవ, గ్యాస్ ఏజెన్సీలు, బ్యాంకులు, పోస్టాఫీసుల్లో బారులు



నాగారంలోని హెచ్‌పీ గ్యాస్ కార్యాలయం వద్ద బారులు తీరిన జనం

సిటీబ్యూరో, డిసెంబర్ 28 (నమస్తే తెలంగాణ) : రాష్ట్ర ప్రభుత్వం కల్పిస్తున్న ఉచిత పథ కాల కోసం ప్రజలు ఆగమాగం అవుతున్నారు. ఉచిత గ్యాస్ కోసం ఇప్పటి నుంచే కేవైసీ లింకేజీ చేయాలని ప్రచారం జరుగడంతో నగరంలోని వివిధ గ్యాస్ ఏజెన్సీల ఎదుట బారులు తీరారు. ఇదిలా ఉంటే ఉచితంగా బస్సుల్లో మహిళలు ప్రయాణించేందుకు ఆధార్ అప్‌డేట్ నిబంధన రావడంతో అందుకు తిప్పలు తప్పడం లేదు. కాగా 10 సంవత్సరాలు దాటిన పిల్లలు తప్ప కుండా ఆధార్‌ను అప్‌డేట్ చేసుకోవాలని చెబు తుండటంతో నగర వాసులు బ్యాంకు, పోస్టాఫీ స్‌ల ఎదుట పడిగాపులు కాస్తున్నారు. అయితే గతంలో బ్యాంకుల్లో ఆధార్ మార్పులు, చేర్పులు చేసే అవకాశం ఉండగా ఇటీవల కొన్ని బ్యాంకులు తొలగించాయి. దీంతో పోస్టాఫీసులకు పరుగులు పెడుతున్నారు. అక్కడ కూడా కొన్ని సెంటర్లు మూసి ఉండటంతో.. మీ-సేవ కేంద్రాలకు పోటె త్తుతున్నారు. కొత్త సంక్షేమ పథకాలేమో కానీ పడి గాపులు కాయాల్సి వస్తున్నదని ప్రజలు వాపోతు న్నారు.

## రొనాల్డ్ రాస్ తీరుపై బీజేపీ కార్పొరేటర్ల ఆగ్రహం

### కమిషనర్ చాంబర్ డోర్‌కు వినతిపత్రం అట్టించి నిరసన



సిటీబ్యూరో, డిసెంబర్ 28 (నమస్తే తెలంగాణ) : జీహెచ్ఎంసీ కమి షనర్ రొనాల్డ్ రాస్ తీరుపై బీజేపీ కార్పొరేటర్లు భగ్గుమన్నారు. కౌన్సిల్ సమావేశం ఏర్పాటు చేయాలని , ప్రజల సమస్యలపై చర్చించేందుకు అపాయింట్‌మెంట్ ఇవ్వాలని అనేక సార్లు కోరినా కనీసం పట్టించుకో వడం లేదంటూ గురువారం జీహెచ్ ఎంసీ ప్రధాన కార్యాలయంలోని ఆయన చాంబర్ ఎదుట ఆందోళన చేపట్టారు. కార్పొరేట ర్లుగా గెలిచి 1000 రోజులు పూర్తయినా కౌన్సి ల్‌లో ప్రజా సమస్యలపై చర్చ లేదని, వెంటనే కౌన్సిల్ ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. కమిషనర్ రొనాల్డ్‌రాస్ అందుబాటులో లేకపోవ డంతో కమిషనర్ చాంబర్ డోర్‌కు వినతిపత్రం అట్టించి కార్పొరేటర్లు నిరసన తెలిపారు.